



చిట్టాపూర్‌లో సమగ్ర సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

తప్పులకు తావులేకుండా సర్వే చేపట్టాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

ముప్కాల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి తప్పులకు తావులేకుండా ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరిస్తూ ఇంటింటి కుటుంబ సర్వేను చేపట్టాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులను ఆదేశించారు. ఆదివారం బాల్కొండ మండలం చిట్టాపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి సమాచారం సేకరిస్తున్న తీరును, నిర్ణీత ఫారంలో ఆయా కోడ్‌ల వారీగా వివరాలు నమోదు చేస్తున్న విధానాన్ని పరిశీలించి కలెక్టర్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కులగణన కోసం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే జిల్లాలోని 547 గ్రామపంచాయతీలతో పాటు నిజామాబాద్ నగర పాలక సంస్థ, బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్ మున్సిపల్ పట్టణాల్లో సజావుగా సాగుతుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా నివాస గృహాలను ఎన్యుమారేషన్ల బ్లాక్‌లుగా విభజిస్తూ, 175 జిల్లాకు ఒక ఎన్యుమారేటర్, పది ఎన్యుమారేషన్‌లకు ఒకరి చొప్పున సూపర్‌వైజర్‌ను నియమించామన్నారు. సర్వే నిర్వహించాల్సిన తీరుపై శిక్షణ తరగతుల ద్వారా ఎన్యుమారేటర్లు, సూపర్‌వైజర్‌లకు క్షుణ్ణంగా అవగాహన కల్పించామన్నారు. సమగ్ర సర్వేను ఆర్డీవోలు, ఎంపీడీవోలు, తహసీల్దార్‌లు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేయిస్తున్నారని తెలిపారు. అంతకు ముందు కలెక్టర్ చిట్టాపూర్ ప్రభుత్వ పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ప్రత్యేక ఓటరు సవరణలో భాగంగా చేపడుతున్న ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఇదీ వరకు నిర్వహించిన ఇంటింటి పరిశీలన సందర్భంగా గుర్తించిన ఓటరు జబితా చేర్చబడ్డాయ లేదా అన్నది క్షుణ్ణంగా పరిశీలించాలని డీఎల్‌వో సూపర్‌వైజర్‌లకు సూచించారు. అదే విధంగా ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్లు, మృతి చెందిన ఓటర్ల వివరాలు ఓటరు జాబితా నుంచి తొలగిస్తూ జరిగిందా లేదా అన్నది పరిశీలించుకోవాలని సూచించారు. అనంతరం కలెక్టర్ బాల్కొండ మండల కేంద్రంలో సహకార సంఘం ఆధ్వర్యంలో కొన సాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. రైతు భారీగా ధాన్యం కొనుగోలు, బిల్లుల చెల్లింపులతో కూడిన వివరాల రిజిస్టర్ పరిశీలించారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని మిల్లర్లకు రవాణా చేసిన వివరాలతో కూడిన చార్ట్‌షీట్‌ను తనిఖీ చేశారు. కలెక్టర్ వెంట ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, బాల్కొండ ఎంపీడీవో కె.భాస్కర్, తహసీల్దార్ శ్రీధర్, సొసైటీ చైర్మన్ సూరజ్, తదితరులు పాల్గొన్నారు.





నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు



భారతీయ సంస్కృతి, సంప్రదాయం ప్రపంచానికే మార్గదర్శం

- ఆర్‌ఎస్‌ఎస్ సహ ప్రాంత ప్రచారక్ ప్రభుకుమార్
- కదంతొక్కుతూ సాగిన పథ సంచలన్
- ఆకట్టుకున్న స్వయం సేవకుల విన్యాసాలు

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతి, సంప్రదాయం ప్రపంచానికే మార్గదర్శం అని, నాటి సంస్కృతి సంప్రదాయాలే విశ్వగురువు స్థానంలో భారతదేశాన్ని నిలబెట్టాయని వక్తగా హాజరైన ఆర్‌ఎస్‌ఎస్ సహ ప్రాంత ప్రచారక్ ప్రభుకుమార్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఐటీఐ మైదానంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థి శిబిర సార్వజనికోత్సవం ఘనంగా సాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా హాజరైన ప్రభుకుమార్ మాట్లాడుతూ.. భారతదేశ సంస్కృతి సంప్రదాయాలు ప్రపంచానికి ఎంతగానో ప్రభావితం చేశాయని అన్నారు. స్వాతంత్య్ర కాలంలో డాక్టర్ హెగ్డేవార్ హిందువులను సంఘటితం చేయడానికి రాష్ట్రీయ స్వయం సేవక్‌ను ఏర్పాటు చేశారని అన్నారు. నాడు హెగ్డేవార్ స్థాపించిన ఆర్‌ఎస్‌ఎస్ నేడు వటవృక్షంగా మారి సేవా కార్యక్రమాలతో పాటు హిందు సంఘటితం చేయడంలో కృషి చేస్తూ వంద సంవత్సరాల ప్రయాణాన్ని కొనసాగిస్తుందని అన్నారు. అఖండ భారతదేశ నిర్మాణమే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యమని అందుకు అనుగుణంగా చేయి చేయి కలుపుతూ దేశవ్యాప్తంగా రాష్ట్రీయ స్వయం సేవక్ పనిచేస్తుందని అన్నారు. ప్రపంచంలో నాలుగు వ్యవస్థలు భారతదేశంపై దాడి చేస్తూ ఆర్థిక, ధర్మ, సంస్కృతి సంప్రదాయాలపై ప్రభావం చూపుతూ తమ ఆధీనంలోకి తీసుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నాయని వాటిని తిప్పికొట్టే విధంగా హిందూ వ్యవస్థ జాగృతం కావాలని అన్నారు. గజవాడ హన్మంత్‌రావు మాట్లాడుతూ.. ఆర్‌ఎస్‌ఎస్ భావజాలాలు ఉన్నవారు విశాలమైన హృదయంతో ముందుకు సాగుతారని అందుకు ఉదాహరణ స్వాతంత్య్ర కాలంలో హెగ్డేవార్ చేసిన సేవలు గుర్తు చేశారు. భారతదేశం స్వాతంత్య్రాన్ని అందుకున్న తర్వాత నాటి పరిస్థితుల్లో ఆర్‌ఎస్‌ఎస్‌పై ప్రతికుల ప్రభావం చూపిన మొక్కవోని ధైర్యంతో తన సేవా కార్యక్రమాలతో వంద సంవత్సరాల ప్రయాణాన్ని కొనసాగిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో విభాగ్ సంఘ్ చాలక్ నిమ్మల ప్రతాప్‌రెడ్డి, కళాశాల విద్యార్థుల శిబిర అధికారి గజాననం, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ, ఆదిలాబాద్, నిర్మల్, కామారెడ్డి, తదితర ప్రాంతాల నుంచి వచ్చిన రాష్ట్రీయ స్వయం సేవక్‌లు పాల్గొన్నారు.

కదంతొక్కుతూ సాగిన పథ సంచలన్..

రాష్ట్రీయ స్వయం సేవక్‌ల పథ సంచలన్ కదం కదంతో అద్వితీయంగా సాగింది. స్వామి వివేకానంద పేరుతో ఖిల్లా రామాలయం నుంచి ప్రారంభమైన స్వయం సేవక్‌ల పథ సంచలనం బోయిగల్లి, బడా రాంమందిర్, ఎంజీ ఫంక్షన్‌హాల్, గురుద్వారా, పెద్దబజార్ చౌరస్తా, శివాజీచౌక్ వరకు, రాజీవ్‌గాంధీ ఆడిటోరియం నుంచి ప్రారంభమైన స్వయం సేవక్‌ల పథ సంచలన్, ముదిరాజ్ హనుమాన్ మందిర్, తిరుమల చౌరస్తా, గోల్‌హనుమాన్, పూలాంగ్ చౌరస్తా మీదుగా శివాజీచౌక్ వరకు, మరొక స్వయం సేవక్‌ల పథ సంచలన్ శంకర్‌భవన్, మైసమ్మగుడి చౌరస్తా, చంద్రానగర్, ఎస్‌ఆర్‌ఎన్ గార్డెన్, సూర్యనగర్, నలందాస్కూల్, న్యాల్‌కల్ రోడ్ మీదుగా శివాజీచౌక్ వరకు సాగింది. స్వయం సేవక్‌ల మూడు పథ సంచలన్‌లు ఒకేసారి శివాజీచౌక్ రావడం అందరిని ఆకర్షింపజేసింది. శివాజీచౌక్ నుంచి మహాసముద్రంగా పథ సంచలన్ వర్నిచౌరస్తా మీదుగా ఐటీఐ మైదానం వరకు సాగింది. పథ సంచలన్‌కు దారి పొడవున పూలతో ఘనంగా స్వాగతం పలికారు. పథ సంచలన్‌లో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి యూనిఫాం, దండ (గణవేశ్)తో పథ సంచలన్‌లో పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శారీరక విన్యాసాలు..

రెండు రోజుల పాటు నిర్వహించిన కళాశాల విద్యార్థి శిబిరంలో స్వయం సేవక్‌లు అభ్యసించిన శారీక దండ విన్యాసాల ప్రదర్శన ఆకట్టుకుంది. విద్యార్థులు కర్ర, ఇతర విన్యాసాలు ప్రదర్శన చూపరులను ఆకర్షింపజేసింది. ఆదిలాబాద్, నిర్మల్, కామారెడ్డి, తదితర ప్రాంతాల నుంచి 343 మంది విద్యార్థులు శిబిరంలో పాల్గొని శారీరక విన్యాసాలు అభ్యసించారు.

పరిధి పెంచారు.. సిబ్బందిని మరిచారు!



- అరకొర సిబ్బందితో పనిచేస్తున్న 'నుడా'
- పరిధి పెంచినా.. సిబ్బంది లేక అవస్థలు
- లేఖలు రాసినా.. పట్టించుకోని ప్రభుత్వం

నిజామాబాద్ అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (నుడా) పరిధి పెంచుతూ ఇటీవల ప్రభుత్వం నిర్ణయించింది. నుడా పరిధిలోకి జిల్లాలోని మూడు మున్సిపాలిటీలను, గ్రామాలను కలుపుతూ నిర్ణయం తీసుకుంది. జిల్లా వ్యాప్తంగా 'నుడా' ద్వారా అభివృద్ధి, ఇతర వసతులు కల్పించేందుకు ఏర్పాట్లు చేసింది. కానీ నుడాకు కావాల్సిన సిబ్బందిని మాత్రం ఇవ్వకపోవడంతో చాలీ చాలని సిబ్బందితో నుడా కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు. నుడా కార్యాలయంలో 140కి పైగా అధికారులు, ఉద్యోగులు ఉండాల్సి ఉండగా ఇప్పటికీ కేవలం ఒకే ఒక్క పోస్టును మాత్రమే కేటాయించింది. ఇదివరకు నుడా పరిధి కేవలం 88 గ్రామాలకే పరిమితం కాగా ఇటీవల ప్రభుత్వం జిల్లాలోని మూడు మున్సిపాలిటీలను వారి పరిధిలోని 380 గ్రామాలను నుడా పరిధిలోకి తీసుకొస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఇప్పటికైనా ప్రభుత్వం నుడాకు పూర్తిస్థాయి అధికారులను, సిబ్బందిని ఇస్తే తప్ప నుడా ఆధ్వర్యంలో చేపట్టాల్సిన పనులకు మోక్షం కలిగే అవకాశాలు ఉన్నాయి. 2017లో నిజామాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేయగా కేవలం చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ పోస్టును మాత్రమే కేటాయించారు. ప్రస్తుతం నుడా పరిధిలో ఒక అసిస్టెంట్ సిటీ ప్లానింగ్ ఆఫీసర్, ఇద్దరు చైన్‌మెన్‌లు, కంప్యూటర్ ఆపరేటర్లు మాత్రమే పనిచేస్తున్నారు. మున్సిపల్ నుంచి ముగ్గురు అధికారులకు నుడా పరిధిలో అదనపు బాధ్యతలు అప్పగించారు. ఒక సీనియర్ అసిస్టెంట్, ఒక జూనియర్ అసిస్టెంట్, నలుగురు అటెండర్లను ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో తీసుకున్నారు. నుడా కార్యాలయానికి శాశ్వత భవనం లేదు. ఇదివరకు కంఠేశ్వర్ వాటర్ ట్యాంక్ వద్దగల జోన్ కార్యాలయంలో కొనసాగేది. ప్రస్తుతం పాత మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఛాంబర్‌లో నుడా కార్యాలయం కొనసాగుతోంది. ఇదివరకే నుడా కార్యాలయం ఏర్పాటుకు గత ప్రభుత్వ హయాంలో పాత అంబేద్కర్ భవన్ పక్కన స్థలం కేటాయించారు. కానీ ఇప్పటికీ కార్యాలయం ఏర్పాటు కార్యరూపం దాల్చలేదు.

అరకొర సిబ్బంది

2017లో నుడా ఏర్పడినప్పుడు నిజామాబాద్ అర్బన్‌తో పాటు నిజామాబాద్ రూరల్, మాక్లూర్ మండలంలోని కొన్ని గ్రామాలు, డిచ్‌పల్లి మండలంలోని కొన్ని గ్రామాలు మొత్తం 88 గ్రామాలు నుడా పరిధిలో ఉండేవి. నగర శివారులోని గ్రామాలన్నింటిని నుడా పరిధిలోకి తీసుకొచ్చారు. ఆ గ్రామాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారు. మొక్కలు పెంచడం, చెరువు కట్టల మరమ్మతులు, చిన్నాపూర్ అర్బన్ పార్క్‌లో క్లాక్ టవర్ ఏర్పాటు తదితర అభివృద్ధి కార్యక్రమాలను నుడా ఆధ్వర్యంలో చేపట్టారు. ఇప్పుడు నుడా పరిధిలోకి జిల్లాలోని ఆర్మూర్, బోధన్, భీంగల్ మున్సిపాలిటీలను, వాటి పరిధిలోని 380 గ్రామాలను చేర్చుతూ ప్రభుత్వం ఇటీవల జీవో విడుదల చేసింది. పరిధిని పెంచినప్పటికీ సిబ్బందిని కేటాయించడం మాత్రం ప్రభుత్వం మరిచింది. 88 గ్రామాలు ఉన్నప్పుడే 140 మందికి పైగా సిబ్బంది అవసరం ఉండగా ప్రస్తుతం 380 గ్రామాలకు మరింత సిబ్బంది అవసరం ఉంటారు కానీ ప్రభుత్వం మాత్రం సిబ్బంది పెంపు విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ప్రస్తుతం ఒక రెగ్యులర్ సీపీవోతో పాటు ఇద్దరు చైన్‌మెన్‌లు, కంప్యూటర్ ఆపరేటర్, మున్సిపల్ నుంచి ముగ్గురు డిప్యూటేషన్‌పై పనిచేస్తుండగా ముగ్గురు ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నారు. ఇటీవల నుడాకు నూతన చైర్మన్ నియామకం కాగా ఇంకా పూర్తిస్థాయి కార్యవర్గం ఏర్పాటు కాలేదు.

మిగతా 8వ పేజీలో...

సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం..

: కేశవేణు, నుడా చైర్మన్



ప్రభుత్వం ఇటీవల నుడా పరిధిని పెంచుతూ జీవో విడుదల చేయడం హర్షనీయం. జిల్లా వ్యాప్తంగా నుడా పరిధిలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నాం. నుడా పరిధిలో పూర్తిస్థాయి సిబ్బంది లేరనే విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తాం. ఖచ్చితంగా నుడాకు అవసరమైన సిబ్బందిని నియమించేందుకు కృషి చేస్తా.



- హర్యానా గవర్నర్ అయినా.. నేను తెలంగాణ బిడ్డనే
- ఆర్‌ఎస్‌ఎస్ స్వయం సేవకుడిని అయినందుకు గర్విస్తున్నా
- నదులను కాపాడాల్సిన బాధ్యత అందరిది
- హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ



గోదావరికి మహా హారతి ఇస్తున్న బండారు దత్తాత్రేయ

కందకుర్తి అభివృద్ధికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న బండారు దత్తాత్రేయ

రెంజల్, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు తలమానికం అయిన కందకుర్తి త్రివేణి సంగమ క్షేత్రాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. మండలంలోని కందకుర్తి త్రివేణి సంగమ క్షేత్రంలో ఆదివారం గవర్నర్ గోదావరి నదికి మహా హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం హెగ్డెవార్ పూర్వీకుల స్థలంలో రూ.40కోట్లతో నిర్మిస్తున్న స్మృతి కేంద్రం నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హర్యానాకు గవర్నర్ అయినప్పటికీ తెలంగాణ బిడ్డనేనని ఇందుకు గర్విస్తున్నానని, తెలంగాణ రాష్ట్రంలో పుట్టిన నేను కేంద్రమంత్రిగా, గవర్నర్‌గా ఎన్నికవ్వడానికి కారణంగా ఆర్‌ఎస్‌ఎస్ శాఖ సంఘమేనని స్పష్టం చేశారు. అనంతరం కందకుర్తి గోదావరి నదిలో ప్రత్యేక పూజలు నిర్వహించి నదికి మహా హారతి సమర్పించి, కందకుర్తి రామాలయంలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డితో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి స్మృతి వన కేంద్రాన్ని ఎమ్మెల్యేతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను 1968 నుంచి 1976వరకు నిజామాబాద్ జిల్లాలో ప్రచారక్‌గా పని చేశానని గుర్తు చేశారు. మళ్లీ ఇక్కడికి గవర్నర్‌గా కాకుండా స్వయం సేవక్‌గానే వచ్చానని, కందకుర్తిని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందేందుకు కృషి చేస్తానని బండారు దత్తాత్రేయ అన్నారు. దేశంలో ఆర్‌ఎస్‌ఎస్ పెద్ద గొప్ప

మిగతా 8వ పేజీలో...

పుష్కరఘాట్‌పై పట్టింపేదీ?

- నిరుపయోగంగా మరుగుదొడ్లు
- మందుబాబులకు నిలయంగా పుష్కర తీరాలు
- ధ్వంసమవుతున్న ప్రభుత్వ కట్టడాలు



పుష్కరఘాట్ వద్ద ఎండలో నిలబడ్డ భక్తులు

7

బొప్పాయి సాగు.. భలే బాగు!

- వాణిజ్య పంటల వైపు రైతన్నల చూపు
- సంప్రదాయ పంటల సాగుకు స్వస్తి పలుకుతున్న యువ రైతులు



రెంజల్‌లో సర్వేను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

సమగ్ర సర్వేకు ప్రజలు సహకరించాలి

● బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

రెంజల్, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలందరు సహకరించి, ఎటువంటి అపోహలు నమ్మవద్దని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. ఆదివారం రెంజల్ మండల కేంద్రంలో ఇంటింటి కుటుంబ సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ సర్వేకు కోసం ఇంటికి వచ్చిన ఎన్యూమలేటర్లకు వాస్తవ వివరాలతో కూడిన సమాచారాన్ని అందించాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో ఏ ఒక్క ఇంటిని కూడా వదలకుండా ప్రతి ఇంటింటికి వెళ్లి సమాచారాన్ని సేకరించాలని అన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సర్వేకు ప్రతి ఒక్కరు సహకరించాలని సూచించారు. సమగ్ర కుటుంబ సర్వే వివరాల సేకరణ చేపట్టే సర్వే బృందానికి నిర్ణీత సమాచారాన్ని అందజేయాలని అన్నారు. కుటుంబ వివరాల సేకరణకు ప్రజలు సహకరించి ఆర్థిక సామాజిక, రాజకీయ, కుల గణన సర్వే కోసం ఎన్యూమలేటర్లు వివరాలు సేకరిస్తారని, వారికి ప్రజలు సహకరించాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందేందుకు ఈ సర్వే ఉపయోగపడుతుందని అన్నారు. అనంతరం సర్వే చేపడుతున్న ఎన్యూమలేటర్లకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, తహసీల్దార్ శ్రావణ్ కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్, మండల అధ్యక్షులు మొబిన్ ఖాన్, మాజీ జడ్పీటీసీ నాగభూషణం రెడ్డి, నాయకులు సాయిబాబా గౌడ్, సాయిరెడ్డి ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

బోధన్‌రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు పని చేయాలని, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ ఉపాధ్యాయుల చేతుల్లో ఉందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. ఆదివారం బోధన్ పట్టణంలోని ఇందూర్ ఉన్నత పాఠశాలలో ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ట్రస్మా అధ్యక్షులు కొడాలి కిషోర్‌కుమార్ జిల్లా, బోధన్ పరిసరా ప్రాంతాలలో ప్రైవేట్ పాఠశాలలు అతి తక్కువ ఫీజులు తీసుకుని నాణ్యమైన విద్యను అందిస్తున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ప్రైవేట్ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు హస్టల్ విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. మౌలిక వసతులు సక్రమంగా ఉండే విధంగా చూడాలన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి, ట్రస్మా జిల్లా ముఖ్య సలహదారులు సిరిగిరి దిగంబర్ రావు, బోధన్ ప్రైవేట్ కళాశాలల, పాఠశాలల యాజమాన్యాల సంఘాల అధ్యక్షులు ముత్యాల హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి మంతె సురేష్, గౌరవ అధ్యక్షులు యార్లగడ్డ శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షులు మిద్దెల రాజు, ఉషోదయ సూర్యప్రకాష్, వంశీ విజయ్‌కుమార్, విజయసాయి కృష్ణ మోహన్, జయప్రకాష్‌లతో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు తదితరులు పాల్గొన్నారు.

జనావాసాల మధ్య డెయిరీ ఫామ్‌ను తొలగించాలి..

బోధన్ పట్టణంలోని ఆచన్‌పల్లి శ్రీరాం కాలనీలో జనావాసాల మధ్య ఏర్పాటు చేసిన డెయిరీ ఫామ్‌ను తొలగించాలని కోరుతూ కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. డైరీ ఫారం వల్ల దోమలు వ్యాపించి ఇబ్బందులకు గురి అవుతున్నామని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ డైరీ ఫారంను మరో చోట ఏర్పాటు చేసుకునే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

రుద్రూరులో ఒకరికి డెంగీ

కోటగిరి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను ప్రతీ ఒక్కరు పరిశుభ్రంగా ఉంచుకోవాలని పీహెచ్‌ఎన్‌వో కృష్ణవేణి సూచించారు. రుద్రూరు మండల కేంద్రంలో ఆదివారం ఓ డెంగీ పాజిటివ్ కేసు నమోదు అయింది. పాజిటివ్ కేసు నమోదు కావడంతో వైద్య సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఇంటింటికి వెళ్లి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఇంట్లో నీటి కుళాయిని పరిశీలించి అపరిశుభ్రంగా ఉన్న నీటిని పారబోయించారు. నీటి కుళాయిలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. అపరిశుభ్రంగా ఉంటే దోమలు వ్యాప్తి చెంది డెంగ్యూ కేసులు నమోదు అవుతాయని ఆమె పేర్కొన్నారు. డెంగ్యూ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఊరచెరువు అలుగు తూము పరిశీలన

బోధన్‌రూరల్, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని ఊట్‌పల్లి గ్రామంలోని ఊర చెరువు అలుగు తూమును ఆదివారం ఇరిగేషన్ శాఖ డిప్యూటీ డీఈ లోక్యా నాయక్ పరిశీలించారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు చెరువు అలుగు తూమును పరిశీలించడం జరిగిందన్నారు. రెండు రోజుల్లో నిర్మాణ పనులను చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఊట్‌పల్లి గ్రామ కాంగ్రెస్ సీనియర్ నాయకులు టప్పా సాయిలు, సాయిరెడ్డి, బల్లెపు నర్సయ్య, జమీల్, సూరి, రైతులు సాయిలు, దండు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు పీసీసీ డెలిగేట్ గంగాశంకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నాగేశ్వర్ రావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కేంద్రాన్ని పరిశీలించిన ఏఎంసీ వైస్ చైర్మన్

వేల్పూర్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పచ్చలనడ్కుడ గ్రామంలో సొసైటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఏఎంసీ వైస్‌చైర్మన్ గడ్డం నర్సారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యం చివరి గింజ వరకు మద్దతు ధర చెల్లించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. సన్నరకం వడ్లకు బోనస్ ఇస్తుందన్నారు. రైతులు ఎవరు కూడా తొందరపడి మధ్యదళారులకు అమ్ముకోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ గడ్డం లింబారెడ్డి, డైరెక్టర్ గట్టుపుతాల నర్సారెడ్డి, టక్కురి గంగాధర్, వాడి మాజీ సర్పంచ్ మహేష్, కాంగ్రెస్ నాయకులు గుడాల మోహన్, లింగేశ్వర్, రఘు, భోజేందర్, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

సనాతన ధర్మాన్ని కాపాడాలని సైకిల్ యాత్ర

ఆర్మూర్‌టౌన్, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ కుక్కలగుట్ట (వెంకటేశ్వరస్వామి) ఆలయం నుంచి సనాతన ధర్మాన్ని కాపాడాలని ఆదివారం రాజుగౌడ్ సైకిల్ యాత్ర నిర్వహించారు. ఈ యాత్ర శాంతియుతంగా పూర్తి చేసుకొని హిందు బంధువుల ఆధారాభిమానులు అందించి యాత్రను పూర్తి చేయాలని ఆయన హిందు బంధువులను వేడుకున్నారు. ఈ యాత్ర 11వేల 40కిలోమీటర్లు పూర్తి చేసుకొని యాత్ర కొనసాగుతుందని, తిరుపతి, అరుణాచలం, కాంచి, గోల్డెన్ మందిరం, కానిపాకం, రామేశ్వరం, ధనుష్‌కోటి, గురుద్వార, ఇస్కాన్ మందిరం, ఆదియోగి మొదలైన ఆలయాలను సందర్శిస్తూ సైకిల్‌యాత్ర చేపడుతున్నట్టు ఆయన తెలిపారు. దేశంతో సనాతన ధర్మాన్ని కాపాడి ధర్మరక్షణ, గోరక్ష కోసం ఈ యాత్ర కొనసాగిస్తున్నట్టు ఆయన తెలిపారు.

యథేచ్ఛగా బెల్టు దందా!

• గ్రామాల్లో పుట్టగొడుగుల్లా దుకాణాలు • అర్ధరాత్రి వరకు విక్రయాలు
• సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులు • చోద్యం చూస్తున్న అధికారులు

బోధన్‌రూరల్, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): బోధన్ డివిజన్‌లోని పలు గ్రామాల్లో బెల్టు షాపుల దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. ఎలాంటి అనుమతులు లేకుండా బెల్టు షాపుల్లో మద్యం విక్రయిస్తున్నారు. పట్టణాలు, మండల కేంద్రాలల్లో అనుమతులతో మద్యం షాపులు కొనసాగిస్తున్నప్పటికీ గ్రామాలల్లో మాత్రం ఎలాంటి అనుమతులు లేకుండానే బెల్టు షాపుల నిర్వాహకులు ఇష్టారీతిన దందా కొనసాగిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించి ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు మద్యం విక్రయాలను చేపడుతున్నారు. బోధన్ డివిజన్‌లోని ఎడపల్లి, రెంజల్, నవీపేట, కోటగిరి, రుద్రూరు, వర్ని, మోస్రా మండలాల్లో వైన్స్ షాపులు ఉన్నాయి. వీటి నుంచి ప్రతిరోజూ ఆటోలో, కారులల్లో బెల్టు షాపులకు మద్యాన్ని తరలిస్తున్నారు. గ్రామాల్లో బెల్టు దుకాణాల నిర్వహణ ఇష్టారాజ్యంగా కొనసాగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. అడ్డుకోవాల్సిన అధికార యంత్రాంగం చోద్యం చూస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామాలు, తండాల్లో బెల్టుషాపు దుకాణాలు కొనసాగుతున్నా అధికారులు చేష్టలుడిగి చూస్తున్నారు. మరోవైపు బెల్టు దుకాణాలు పల్లె ప్రజలను మత్తులో ముంచేత్తుతున్నాయి. నిబంధనలకు వ్యతిరేకంగా బెల్టు దుకాణాలు కొనసాగుతున్న చర్యలు తీసుకోవడంలో అధికార యంత్రాంగం విఫలమవుతోంది.



ఎడపల్లిలో మూసి ఉన్న బెల్టు షాపు వద్ద ఎక్సైజ్ అధికారులు

బెల్టు షాపులను ప్రోత్సహిస్తున్న వ్యాపారులు

మద్యం వ్యాపారులు పలువురు పలుకుబడి ఉన్నవారు సిండికేట్‌గా మారి మద్యం దుకాణాలు దక్కించుకునేందుకు పోటీపడ్డారు. గ్రామాలల్లో బెల్టు షాపుల నిర్వహణకు మాత్రం అడ్డూ అదుపు లేకుండా పోయిందన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. వ్యాపారులు బెల్టు షాపులను ప్రోత్సహించేందుకు ఆటోలో, కారులో గ్రామాలకు మద్యం తరలిస్తున్నారు. అధికారులు స్పందించి బెల్టు షాపుల నిర్వహణకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

మామూలుగా తీసుకుంటున్న అధికారులు

గ్రామాలలో బెల్టు షాపులపై ఉక్కుపాదం మోపాల్సిన ఎక్సైజ్ అధికారులు చోద్యం చూస్తున్నారు. బెల్టు షాపులపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మామూలుగా తీసుకుంటున్నారు. కొత్త మద్యం విధానం అమల్లోకి వచ్చిన గ్రామాలలో బెల్టు దుకాణాలు మూడు పువ్వులు, ఆరు కాయలు అన్న చందంగా వ్యాపారం కొనసాగుతుంది. ఒక్కో గ్రామంలో రెండు నుండి ఐదు వరకు బెల్టు షాపులు నిర్వహిస్తున్నారు. గ్రామం ఆధారంగా బెల్టు షాపుల నిర్వహణ కొనసాగుతుంది. పెద్ద గ్రామం అయితే వీటి సంఖ్య ఇంకా ఎక్కువగానే ఉంటుందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు విక్రయాలు

గ్రామాల్లోని బెల్టు షాపులలో నిర్వాహకులు ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు మద్యాన్ని విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువగా 10 రూపాయల నుంచి 30రూపాయల వరకు అదనంగా అమ్ముతున్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులు వీటిని చూసిచూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. బెల్టు షాపులను కట్టడి చేయకపోవడంతో ప్రజలు అధిక డబ్బులు చెల్లించి గ్రామాలలోనే మద్యాన్ని కొనుగోలు చేస్తున్నారు.

దాడులకు ముందే సమాచారం

గ్రామాలల్లో నిర్వహిస్తున్న బెల్టు షాపులపై ఎక్సైజ్ శాఖ అధికారులు దాడులు నిర్వహించేందుకు ముందుగానే సమాచారం వస్తుందంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. కొన్ని మండలాల్లో పైకి పాల దుకాణం బోర్డు పెట్టి లోపల సిట్టింగ్‌లకు పర్మిషన్ ఇస్తున్నారు. వైన్స్‌ల కంటే అధిక ధరలకు మద్యాన్ని విక్రయించడంతో పాటు తినడానికి కావాల్సిన పదార్థాలను విక్రయిన్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులుకు ఎవరైనా ఫిర్యాదు చేస్తే దాడులకు వచ్చే ముందే బెల్టు షాపుల నిర్వాహకులకు సమాచారం ఇస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దీంతో బెల్టు షాపులపై దాడులు చేసినా.. కేసులు మాత్రం నమోదు కావడం లేదు.

పూర్తి స్థాయిలో రోడ్డు వెడల్పు పనులు చేయాలి

నందిపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో చేపడుతున్న ప్రధాన రోడ్డు వెడల్పు పనులు పూర్తి స్థాయిలో చేపట్టాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు రాస్తారోకో చేశారు. 20వేల జనాభా ఉన్న నందిపేట మండల కేంద్రంలో 20 మంది చెప్పినట్లు రోడ్డు వెడల్పు పనులను ఆర్‌అండ్‌బి అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్ చేస్తున్నారని కొత్త బస్టాండ్ ఎదుట బైఠాయించి ఆరోపణలు చేశారు. నంది విగ్రహం నుంచి కొత్త బస్టాండ్ మీదుగా జామ మసీద్ వరకు జీవోకు అనుగూనంగా రోడ్డు వెడల్పు పనులు చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లా స్థాయి అధికారులకు పిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మూడు పంథలకు చెందిన సదర్‌లు, పెద్ద మనుషులు, చిన్న మనుషులు తదితరులు ఉన్నారు.



నందిపేటలో రాస్తారోకో చేస్తున్న గ్రామస్థులు

కాలభైరవ స్వామి జన్మదిన వేడుకలను విజయవంతం చేయాలి

● ఆలయ ఈవో బుర్ల ప్రభురాంచంద్రం

రామారెడ్డి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న కాలభైరవ స్వామి ఆలయంలో ఈ నెల 20 నుంచి 24వ వరకు జన్మదిన వేడుకలను నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో బుర్ల ప్రభు రాంచంద్రం గుప్తా తెలిపారు. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గం ఇసన్నపల్లి - రామారెడ్డి మండల కేంద్రం ఆవరణలో వెలసిన భైరవుని ఆల యంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల నవంబరు 20వ తేదీన బుధవారం నుంచి 24వ తేదీ వరకు జన్మదిన వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపారు. 20వ తేదీన బుధవారం గణపతి పూజ, పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, కంకణ ధారణ, సంతత ధారణభాషేకం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో, మునిగాల భారతమ్మ వెంకయ్య నిర్వహిస్తారని తెలిపారు. 21న గురువారం బద్ది పోచమ్మ అమ్మకు బోనాలు, 22వ తేదీన శుక్రవారం లక్ష దీపార్చన, సాంస్కృతి కార్యక్రమాలు, 23వ తేదీన ప్రత్యేక పూజలు, సంతతధారాభిషేకం, ధ్వజా రోహణం, మహా పూజ, దక్షయజ్ఞం, సింధూర పూజ, డోలా రోహణం, భక్తులకు అన్నదానం, ఎడ్లబండ్ల ఊరేగింపు, భద్రకాలి పూజ, రాత్రి భద్రకాలి పూజ, పల్లకి సేవ, ఒగ్గుకథ, 24వ తేదిన ఆది వారం ఉదయం రథోత్సవం, దక్ష యజ్ఞం ము నిగాల భారతమ్మ వెంకయ్య ఆధ్వర్యంలో కొనసాగుతున్నట్లు ఆలయ ఈవో బుర్ల ప్రభు రాంచంద్రం గుప్త వివరించారు. ఈ ఉత్స వాలకు ముఖ్య అతిథులుగా ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, ఉమ్మడి జిల్లాల ఆలయాల సహాయ కమిషనర్ వి.విజయ రామారావు, కామారెడ్డి జిల్లా కలెక్టర్ అశిష్ సంగ్వాన్, ఎస్పీ, అధికారులు, సలహాదారులు హాజరవుతారని ఆలయ ఈవో వివరించారు.



వేడుకలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఈవో, పురోహితులు, సిబ్బంది



కాలభైరవ స్వామి విగ్రహం

ఆలయంలో భక్తుల సందడి

దక్షిణ కార్తీక మాసం రెండో ఆదివారం వైభవంగా భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. కామారెడ్డి, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల తదితర జిల్లాల భక్తులు అధిక సంఖ్యలో హాజరైన భక్తులు ప్రత్యేక పూజలు, దీపారాధన నిర్వహించారు. ఆలయ గర్భ గుడిలో సింధూర, ప్రత్యేక పూజలు, అభి షేకాలు, పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం శనేశ్వర, నాగ దేవత, శివాలయం, నవ గ్రహాల గుడి దేవుళ్ళకు మొక్కులు మొక్కి పూజలు నిర్వహించారు. అంతకు ముందు ఆలయం ఆవరణలో గల బావి నీటితో స్నానాలు చేసి తడి బట్టలతో భైరవున్ని గర్భగుడిలో తడి పూజలు నిర్వహించారు. ఆలయ పురోహితులు శ్రీనివాస్ శర్మ మంత్రోశ్చరణలతో భక్తులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ బుర్ల ప్రభు రాంచంద్రం గుప్త, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్, సిబ్బంది నాగరాజు, వ్యాపారులు, వైద్యులు, రాజకీయ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో భక్తుల రద్దీ

అన్ని రాజకీయ పార్టీలకు

మాలల సత్తా తెలియజేయాలి

● ఆత్మీయ సమ్మేళనంలో చెన్నూరు ఎమ్మెల్యే వివేక్



మాట్లాడుతున్న చెన్నూరు ఎమ్మెల్యే వివేక్

నిజామాబాద్ అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు వచ్చాక మాలలలో అభద్రతాభావం నెలకొందని భయం వీడి ధైర్యం చూపి అన్ని రాజకీయ పార్టీలకు మాలల సత్తా అర్థమయ్యేలా ఐక్యంగా ఉండాలని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. ఆదివారం నగరంలోని శ్రావ్యాగార్డెన్‌లో మాలల ఆత్మీయ సమ్మేళనంకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర జనాభాలో రెండో స్థానంలో ఉన్న మాలల జాతిని తక్కువ చేసి చూపిస్తున్నారని మాల జాతి ఐక్యతను చీల్చడానికి కుట్రలు జరుగుతున్నాయని అన్నారు. మాలల ఐక్యతను చాటడానికి తన తండ్రి వెంకటస్వామి స్ఫూర్తితో బయటకు వచ్చానని ఆయన అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కీలకపాత్ర పోషించానని ప్రజల ఆకాంక్షలు తెలపడానికి ఛానల్, పేపర్లు ప్రారంభించానన్నారు. ఇప్పుడు మేల్కొనకపోతే మాల జాతి భవిష్యత్తు అఘాతంలో పడుతుందని సొంత ప్రయోజనాలు పక్కన బెట్టి జాతి ప్రయోజనాల కోసం సమయం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఏసీబి దాడులు 90 శాతం మాల ఉద్యోగులపైనే జరుగుతున్నాయని ఇది సరికాదన్నారు. వర్గీకరణపై సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం సరైంది కాదని తాను చెప్పానని అన్నారు. డిసెంబర్ 1న హైదరాబాద్‌లో తలపెట్టిన మాలల సభను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సభలో రాష్ట్ర వ్యవసాయ సంక్షేమ కమీషన్ సభ్యుడు గడుగు గంగాధర్, మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ నాగరాజు, మాల ఉద్యోగుల గౌరవ అధ్యక్షులు అలుక కిషన్, అమృత్‌కుమార్, మాల ఉద్యోగుల అధ్యక్షుడు ఉదయ్, స్వామిదాస్, ఎల్లమయ్య, సుశీల్‌కుమార్, వాగ్మారే పాల్గొన్నారు.

సీసీ రోడ్లను పరిశీలించిన తాజా మాజీ జడ్పీటీసీ ఉషాగౌడ్

ఎల్లారెడ్డి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఆదేశాల మేరకు గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి గ్రామంలో అవసరమున్న చోట సీసీ రోడ్ల నిర్మాణానికి స్థలాలు పరిశీలించి కొలతలు నిర్వహించారు.

ఉమ్మడి మద్నూర్ మండల

ఆదర్శ రైతు కార్యవర్గం ఎంపిక



నూతనంగా ఎంపికైన ఆదర్శ రైతు కార్యవర్గ సభ్యులు

మద్నూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మద్నూర్ మండలంలో ఆదర్శ రైతు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం మద్నూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో ఉమ్మడి మద్నూర్ మండల రైతులు ఈ సమావేశంలో పాల్గొని ఆదర్శ రైతు నూతన కమిటీని ఎన్నుకున్నట్లు అధ్యక్షులు గంగారాం తెలిపారు. ఉమ్మడి మద్నూర్ మండల ఆదర్శ రైతు అధ్యక్షులుగా గంగారాం, ఉపాధ్యక్షులుగా గిరి ప్రకాష్, కోశాధికారిగా నగేష్, సభ్యులు మల్లికార్జున్, సాయిలు, మస్నాజీ, యాదవ్, విఠల్, సాయిలును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ రైతులకు అండగా ఉండి పంట దిగుబడులకు ఎంతో కృషి చేసిన ఆదర్శ రైతు వ్యవస్థను పునరుద్ధరించాలని గతంలో కాంగ్రెస్ హయాంలోనే ఆదర్శ రైతు కమిటీలు ఉండేవని టీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తరువాత వాటిని రద్దు చేశారన్నారు.

లింగంపేట మండల కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలిగా స్వప్న

లింగంపేట, నవంబర్ 10 (ఆంధ్రజ్యోతి): మండల కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలిగా సిలమంతుల స్వప్నను ఆదివారం ఎల్లారెడ్డి నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు అరుణ ఆధ్వర్యంలో ఎన్నుకున్నట్లు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ తెలిపారు. ఉపాధ్యక్షురాలిగా మన్నె లక్ష్మి, శోభ, కార్యదర్శిగా కవిత లావణ్య, కార్యవర్గ సభ్యులుగా పద్మ, బెస్త సావిత్రి, సాయవ్వ, బండి ఎల్లవ్వ, అంగూరిలను ఎన్నుకున్నట్లు ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎల్లమయ్య, అట్టెం శ్రీను, అశోక్, భైరయ్య, నాగరాజు ఉన్నారు.



లింగంపేటలో కాంగ్రెస్ నూతన మండల మహిళా కార్యవర్గం



నాగేపూర్‌లో ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్‌లను పరిశీలిస్తున్న రైతులు

రెండు ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం

● కాపర్‌కాయిల్ చోరీ

నవీపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగేపూర్ శివారులోని రెండు ట్రాన్స్‌ఫార్మర్లను శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దొంగలు ధ్వంసం చేసి కాపర్ కాయిల్స్ ఆయిల్‌ను ఎత్తుకెళ్లారని ఎస్సై వినయ్ తెలిపారు. ఎస్ఎస్42, 25కేవీ, ఎస్ఎస్66, 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తు తెలియని దొంగలు ధ్వంసం చేసి అందులో ఉన్న కాపర్ కాయిల్స్‌తో పాటు ఆయిల్‌ను ఎత్తుకెళ్లారని ఆయన తెలిపారు. లైన్‌మెన్ నవీన్ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

బోధన్‌రూరల్, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని ఆటో నగర్ సమీపంలో ఆదివారం అక్రమంగా పీడీఎస్ బియ్యం తరలిస్తున్న బొలేరో వాహనంతో పాటు 20క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. బొలేరో వాహనంలో 50బస్తాల రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. అక్రమంగా తరలిస్తున్న రైస్‌మిల్లుకు తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేశామన్నారు. పట్టుకున్న వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

ట్రాలీ ఆటోను ఢీకొట్టిన కారు

నవీపేట,నవంబరు10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాల ఎదురుగా ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్రాలీ ఆటోను వెనుక నుండి కారు ఢీకొన్న ఘటనలో ఆరుగురికి గాయాలయ్యాయి. ఎస్ఐ వినయ్, స్థానికులు తెలిపిన ప్రకారం.. నిజామాబాద్‌కు చెందిన ఒకే కుటుంబానికి చెందిన వారు ట్రాలీ ఆటోలో రెంజల్ మండలం సాటాపూర్ నుండి నిజామాబాద్‌కు వెళ్తున్నారు. స్థానిక ప్రైవేటు పాఠశాల ఎదురుగా ఉన్న స్పీడ్ బ్రేకర్ వద్ద ఆటో డ్రైవర్ వేగాన్ని తగ్గించగా వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు ట్రాలీ ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ట్రాలీలో ప్రయాణిస్తున్న ఇద్దరు మహిళలతో పాటు 13సంవత్సరాల బాలుడు, మరో వ్యక్తి కిందపడి గాయాలపాలయ్యారు. అలాగే ట్రాలీ ఆటో డ్రైవర్‌తో పాటు కారును నడుపుతున్న రెంజల్ మండలం వీరన్నగుట్టకు చెందిన రవిగౌడ్‌కు సైతం గాయాలయ్యాయి. వెంటనే బాధితులను 108లో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలానికి ఏఎస్ఐ యాదగిరి గౌడ్ చేరుకుని వివరాలు సేకరించారు. ప్రమాదం జరిగిన వెంటనే ఆటో నుండి ట్రాలీ వేర్వేరుగా విడిపోగా కారు బోల్తాపడింది. ప్రమాదంలో గాయపడిన వారి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్ఐ తెలిపారు.

కేజీబీవీ పాఠశాలపై నుంచి పడి విద్యార్థినికి తీవ్ర గాయాలు

ఏర్గట్ల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కోతులు తరమడంతో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం రెండో అంతస్తుపై నుంచి కింద పడ్డ విద్యార్థిని సంఘటన ఆదివారం నిజామాబాద్ జిల్లాలో చోటు చేసుకుంది. వివరాలు.. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం సిర్‌పూర్ గ్రామానికి చెందిన కర్రె అంజలి అనే విద్యార్థిని నిజామాబాద్ జిల్లా ఏర్గట్ల మండలంలోని కేజీబీవీలో తొమ్మిదవ తరగతి చదువుతోంది. ఆదివారం సెలవు కావడంతో బట్టలు ఉతుక్కుని పాఠశాలపై గల రెండో అంతస్తులో ఆరవేయడానికి వెళ్లింది. ఈ క్రమంలో కోతులు తరమడంతో భయపడి పరుగు తీయడంతో పాఠశాలపై నుంచి కింద పడింది. దీంతో ఆమె ఎడమ చెయ్యి విరిగిపోగా వెన్నుపూస, నడుము భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. విషయాన్ని అంజలి తల్లిదండ్రులకు తెలుపడంతో కుటుంబ సభ్యులు పాఠశాలకు వచ్చి ఆస్పత్రికి తరలించకపోవడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఇన్‌చార్జి ఉపాధ్యాయురాలు స్రవంతి అంబులెన్స్‌కు ఫోన్ చేయగా జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు వచ్చేంత వరకు విద్యార్థినిని ఆస్పత్రికి తరలించకపోవడంతో పాఠశాల సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

మాక్లూర్‌లో శవం లభ్యం

మాక్లూర్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మాక్లూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దాస్‌నగర్ గ్రామశివారులో గల నిజాంసాగర్ కెనాల్ వద్ద ఆదివారం గుర్తుతెలియని శవం లభ్యమైనట్టు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. 35నుంచి 40ఏళ్ల వయస్సు ఉంటుందని 25 రోజుల క్రితం మృతి చెంది గుర్తుతెలియని శవం కుళ్లిపోయి ఉందన్నారు. మృతుడు ప్యాంటు, షర్టు ధరించి ఉన్నాడని, కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

బైక్‌పై నుంచి పడి యువకుడి మృతి

మాక్లూర్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మాక్లూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చిక్లి గ్రామశివారులో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో దర్మోరం గ్రామానికి చెందిన శ్రీకాంత్(28) అనే యువకుడు మోటర్ సైకిల్ అదుపుతప్పి కింద పడి మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. మృతుడు ఎస్ఎస్ఆర్ కళాశాలలో జన్నెపల్లి బ్రాంచ్‌లో బస్‌క్లీనర్‌గా పని చేస్తున్నాడు. శనివారం పాఠశాలకు సెలవు కావడంతో పేరెంట్స్ మీటింగ్‌కు వెళ్లి జన్నెపల్లి నుంచి రాత్రి సమయంలో తిరుగుప్రయాణం కాగా మోటర్ సైకిల్ అదుపుతప్పి కిందపడిపోయాడు. దీంతో ఆదివారం రోడ్డు పక్కన శ్రీకాంత్ మృతదేహన్ని చూసిన కొందరు పోలీసులకు సమాచారం అందించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు తెలిపారు. కాగా, శ్రీకాంత్‌కు ఇటీవలే వివాహం జరిగింది.

ఫోకస్



బొప్పాయి సాగు భలే బాగు!

- వాణిజ్య పంటల వైపు రైతన్నల చూపు
- సంప్రదాయ పంటల సాగుకు స్వస్తి పలుకుతున్న యువ రైతులు
- స్వల్ప కాలంలో లక్షల రూపాయల లాభం సాధించి అందరికీ ఆదర్శంగా..
- వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పిస్తూ ముందుకు

పెద్దకొడప్‌గల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆ రైతు గత సంవత్సరం వరకు అందరి లాగే సంప్రదాయ పంటలను పండిస్తూ వచ్చాడు. అయితే ఈ సంప్రదాయ పంటలతో లాభం లేదని వాణిజ్య పంటలతో అధిక లాభాలు ఆర్జించవచ్చని పొరుగు గ్రామానికి చెందిన ఓ రైతు సూచనతో నేడు తనకున్న నాలుగు ఎకరాల చేనులో బొప్పాయి పంటనుసాగు చేస్తూ లాభాలవైపు దూసుకెళ్తున్నాడు. జుక్కల్ మండలంలోని ఖండెబల్లూర్ గ్రామానికి చెందిన యువరైతు బస్వరాజ్ రెడ్డి డిగ్రీ పూర్తి చేసి ప్రభుత్వ ఉద్యోగాల వేటకు వెళ్లకుండా వ్యవసాయంలోనే ముందుకు వెళ్లాలని భావించి అటువైపు అడుగులు వేశారు. అయితే ముందుగా సంప్రదాయ పంటలను సాగు చేయగా ఏ మాత్రం లాభాలు రాలేదని, దీంతో లాభాలు అధికంగా వచ్చే పంటలు ఏమున్నాయో అన్వేషించి బొప్పాయి సాగు వైపు అడుగులు వేశారు. గత ఫిబ్రవరిలో సాగుచేసిన బొప్పాయి ప్రస్తుతం పంట చేతికి వచ్చి లాభాలు వస్తున్నాయని సంతోషం వ్యక్తం చేస్తున్నాడు. అంతేగాక తనకు లాభాలు రావడంతోపాటు తన చేలో 10 కూలీలకు ఉపాధి కల్పించడం సంతోషంగా ఉందని తెలిపారు.

బొప్పాయి సాగు వైపు అడుగులు

బొప్పాయి సాగుచేయాలనే ఉద్దేశ్యంతో ఫిబ్రవరి నెలలో మహారాష్ట్ర నుంచి ఒక్కో మొక్కను రూ.15 చొప్పున ఎకరాకు వెయ్యి మొక్కల చొప్పున 4వేల మొక్కలను తీసుకొచ్చినాటానని బస్వరాజ్‌రెడ్డి తెలిపాడు. అందులో నుంచి సుమారు 500 వరకు మొక్కలు వివిధ రోగాలతో చనిపోగా.. మిగతా మొక్కలు ప్రస్తుతం కాత దశకు వచ్చి పంట చేతికి అందుతుందని తెలిపారు. బొప్పాయి సాగు చేసే సమయంలో డ్రిప్ ద్వారా పంటకు సాగునీరు అందించినట్లు పేర్కొన్నాడు. ఒకసారి పంటనుసాగు చేస్తే రెండున్నర సంవత్సరాల వరకు మొక్కలు ఉండి బొప్పాయి పంట చేతికి అందుతుందని తెలిపారు.

పంటకు బయోఎరువుల వాడకం

బొప్పాయి పంటను సాగు చేసే సమయంలో పంటకు రసాయన ఎరువులు తక్కువగా వాడి బయో ఎరువులు వాడానని, దీంతో పంట బాగా వచ్చిందని చెప్తున్నాడు. కొన్ని సమయాలలో తానే జీవామృతం తయారు చేసి పంటకు వేసినట్లు తెలిపాడు. మొక్కలు పెట్టిన తర్వాత 8నెలల వరకు పంట రాదని, అక్కడి నుంచి రెండు సంవత్సరాల వరకు ఇదే మొక్కలకు కాత ఉంటుందని తెలిపారు. బొప్పాయి సాగు చేయడం వలన తాను చేలో పది మందికి ఉపాధి కల్పించడం ఆనందం గా ఉందని తెలిపారు. పంట ప్రస్తుతం చేతికి రావడంతో ఓ వ్యాపారికి పంటను అమ్మివేశానని తెలిపారు.

ఖర్చు తక్కువ లాభం ఎక్కువ

బొప్పాయి పంట సాగు కోసం ఇప్పటివరకు ఎక రాకు సుమారు రూ.1.20 లక్షల ఖర్చు అయినట్లు చెప్తున్నాడు. అయితే పంటను ప్రస్తుతం అమ్ముతు న్న తరుణంలో ఎకరా పంటకు సుమారు రూ.2.20 లక్షల ఆదాయం వచ్చిందని తెలిపారు. ప్రస్తుతం ఉన్న పంట ఫిబ్రవరి వరకు వ్యాపారికి ఉంటుం దని, అనంతరం వచ్చే పంటను ఇతరులకు అమ్మితే మరింత ఆదాయం సమకూరుతుందని తెలిపారు. ప్రస్తుతం చేతికి వచ్చిన బొప్పాయి పంటను తమ దగ్గర వ్యాపారి కొనుగోలు చేసి వాటిలో నాణ్యత ను బట్టి బొప్పాయి పండ్లను హైదరాబాద్, ఢిల్లీ లాంటి ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారని తెలిపారు. తక్కువ ఖర్చుతో లాభాలు అధికంగా వస్తుండటం సంతోషంగా ఉందని తెలిపారు. తరుచూ నష్టాలిచ్చే పంటలను వదిలి లాభసాటి సాగుపై దృష్టి పెట్టాలని రైతులు ఆలోచిస్తున్నారు.



దర్జాగా మెడికల్ దందా!

- డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండానే మందుల పంపిణీ
- అర్హత లేని వారితో మందుల విక్రయం
- దందాపై కన్నెత్తిచూడని అధికారులు



అంకోల్ గ్రామంలో రోగులకు మెడికల్ షాపులో మందులు విక్రయిస్తున్న వైద్యుడు

నసురుల్లాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నసురుల్లాబాద్ మండల కేంద్రంతోపాటు మండలంలోని ఆయా గ్రామాల మెడికల్ నిర్వాహకులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. రోగికి ఏ నొప్పి ఉన్నా డోలో 650తో సరిపెడుతున్నారు. మెడికల్ దందా ఇష్టారీతినా కొనసాగుతుందని అనడంలో అతిశయోక్తి లేదు. ఏరోగానికైనా ఎర్రగోలి, పచ్చగోలి అంటూ ఇష్టారీతిన మందులు సరఫరా చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేనిదే మెడికల్ దుకాణంలో మందులు ఇవ్వొద్దనే నిబంధనను పెడచెవిన పెట్టి మెడికల్ నిర్వాహకులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. దీనికి తోడు కాళ్ల నొప్పులు, మోకాళ్లలో అరుగుదల, షుగర్, బీపీ, థైరాయిడ్ వంటి సమస్యలను పరిష్కరిస్తామంటూ పీఎంపీ, ఆర్ఎంపీ డాక్టర్లు బోర్డులు పెట్టి తమకు అనుకూలమైన మందులు రాస్తున్నట్లు ఆరోపణలున్నాయి. సంబంధిత మండల, జిల్లా అధికారులు కనీసం మెడికల్ దందాలపై కన్నెత్తి చూడకపోవడంతో మెడికల్ వ్యాపారస్తులు ఆడిందే ఆట, పాడిందే పాటగా వారి వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా నడుస్తుందని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు.

● పుట్టగొడుగుల్లా వెలుస్తున్న క్లినిక్‌లు

నసురుల్లాబాద్ మండల కేంద్రంతోపాటు ప్రతీ గ్రామానికి మూడు నుంచి నాలుగు మెడికల్‌లు, క్లినిక్‌లు వెలిశాయి. రోగులు తమ సమస్యలతో వారి వద్దకు వెళ్తే చాలు కొత్త రోగాల పేరు చెబుతూ మందులు రాసి వారి వద్ద నుంచి ముక్కు పిండి డబ్బులు వసూలు చేస్తున్నారని మండల ప్రజలు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. సంబంధితశాఖ అధికారులు స్పందించి అనుమతి లేకుండా దర్జాగా మెడికల్ దందా నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు వాపోతున్నారు.

మందులకు పెన్షన్ డబ్బులు సరిపోవడం లేదు

● ఊర్మిళ, నసురుల్లాబాద్

వయసు మీద పడుతున్న కొద్ది ఒళ్లు నొప్పులు, కీళ్ల నొప్పులు రావడంతో నెలకి ఒకసారి మెడికల్ షాప్‌లో మందులు కొనాల్సి వస్తోంది. మాత్రలకు పెన్షన్‌డబ్బులు సరిపోవడం లేదు.

మత్స్యకారుడి వలకు 5ఫీట్ల పాపెర



డొంకేశ్వర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): డొంకేశ్వర్ మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన మత్స్యకారుడి వలకు పెద్ద చేప చిక్కింది. రోజుమాదిరిగానే మత్స్యకారుడు బాజన్న ఆదివారం రోజు గ్రామశివారులోని ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్‌లో చేపల వేటకు వెళ్లాడు. నీటిలో ఉన్న వలను చూసే సమయంలో ఆయన వలకు 5 అడుగుల పాపెర చేప చిక్కింది. దీంతో ఆయన వ్యాపారులకు విక్రయించారు. తన వలకు పెద్దచేప పడడం అయితే తొలిసారని తెలిపాడు. ఇంత పెద్ద చేపను ప్రజలు ఆసక్తిగా చూశారు.

పుష్కరఘాట్‌పై పట్టింపేదీ?

- నిరుపయోగంగా మరుగుదొడ్లు
- మందుబాబులకు నిలయంగా పుష్కర తీరాలు
- ధ్వంసమవుతున్న ప్రభుత్వ కట్టడాలు
- ఆనవాళ్లు కోల్పోయిన పుష్కర తీరాలు

ఆంధ్రజ్యోతి పరిశీలన



పుష్కరఘాట్ వద్ద ఎండలో నిలబడ్డ భక్తులు



నిరుపయోగంగా మినీవాటర్ ట్యాంక్



ధ్వంసమైన మరుగుదొడ్లు

మెండోర, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం ఏర్పడగానే రాష్ట్ర ప్రభుత్వ నాడు ప్రతిష్ఠాత్మకంగా మెండోర మండలంలో ఏర్పాటుచేసిన పోచంపాడ్ పవిత్రపుణ్యక్షేత్రం గోదావరి నది ఒడ్డున పుష్కరపుణ్య ప్రాప్తింపజేసే పుష్కరతీరాలు నేడు ఆనవాళ్లు కోల్పోయి అధ్వాన స్థితికి చేరాయి. ప్రభుత్వ కట్టడాల ధ్వంసం కాగా, భక్తుల సౌకర్యార్థం కోసం ఏర్పాటు చేసిన వసతులు అధ్వాన స్థితికి చేరాయి. అధికారుల నిర్లక్ష్యమో లేక పర్యవేక్షణ లోపమో కానీ కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన పనులన్నీ మళ్లీ వచ్చే పుష్కరాల వరకు కాల గర్భంలో కలిసిపోనున్నాయి. నేడు కొత్తగా ఏర్పడిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వమైనా పుష్కరఘాట్‌పై దృష్టి సారించి ఆనవాళ్లు కోల్పోయిన ప్రభుత్వ కట్టడాలను వినియోగంలోకి తేవాలని భక్తులు కోరుతున్నారు.

జాడలేని బోరుమోటార్లు

పుష్కరాలు సమయంలో ప్రభుత్వం రక్షిత మంచినీటిని అందించేందుకు పలుచోట్ల బోర్లను వేసింది. దీనికి మోటార్లను సైతం అప్పట్లో అధికారులు బిగించారు. ప్రస్తుతం మోటార్ల జాడ కనిపించడంలేదు. కొందరు వ్యక్తులు తీసుకువెళ్లి తమ ఇళ్లల్లో పెట్టుకొని వాడుతున్నారని సమాచారం.

నిరుపయోగంగా మినీవాటర్ ట్యాంకులు

పుష్కరఘాట్ వద్ద ఉన్న మినీవాటర్ ట్యాంకులు నిరుపయోగంగా ఉండడంతో పుణ్యస్నానాలు చేయడానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తప్పడంలేదు. నీటి సౌకర్యం లేక నానా తంటాలు పడుతున్నారు. పుష్కరఘాట్ వద్ద తాగునీటి కోసం ఏర్పాటు చేసిన నల్ల పైపులను సైతం గుర్తుతెలియని వ్యక్తులు తాగునీటి కోసం ఏర్పాటు చేసిన గోడలను ధ్వంసం చేసి పైపులను ఎత్తుకెళ్లిన సంఘటన పోచంపాడ్ పుష్కరఘాట్ వద్ద ఉన్నాయి.

మరుగుదొడ్లు, గదుల తలుపులు మాయం

నాడు రాష్ట్ర ప్రభుత్వం పుష్కర సమయంలో స్త్రీలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు మరుగుదొడ్లను పుష్కర స్నానం ఆచరించి తర్వాత స్త్రీలు దుస్తులు మార్చుకునే గదులను లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించారు. వీటిపై గజదొంగల కన్ను పడడంతో స్త్రీలు దుస్తులు మార్చుకునే గదులు, మరుగుదొడ్లను ధ్వంసం చేసి తలుపులు మీద ఉన్న రేకులను ఎత్తుకెళ్లారు.

మందుబాబులకు అడ్డాగా..

పవిత్ర పుణ్యక్షేత్రం గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించడానికి వచ్చే భక్తులకు మందుబాబులతో ఇబ్బందులు తప్పడంలేదు. భక్తుల సౌకర్యం కోసం వంట నల్లాలు ఏర్పాటు చేసిన సెడ్డుల వద్ద మందు బాబులు మద్యం తాగి పార్టీలు చేసుకుంటూ అలజడి చే స్తున్నారు. దీంతో భక్తులు దిక్కుతోచని స్థితిలో చెట్ల కింద వంటలు చేసుకొని వెళ్తున్నారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి పుష్కరఘాట్ వద్ద స్నాన ఘట్టాకు నిర్మిస్తే ఇప్పుడు నాసు, చెత్త చెదరాలతో దర్శనం ఇవ్వడంతో భక్తులకు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పవిత్ర పుణ్యక్షేత్రం గోదావరి నదిలో స్నానం ఆచరించడానికి వస్తే ఇక్కడ కనీసం సౌకర్యాలు లేవని భక్తులు ముక్కున వేలేసుకుంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పుష్కర తీరాలా వద్ద సౌకర్యాలు కల్పించి మందు బాబులను అరికట్టాలని భక్తులు కోరుతున్నారు.



భక్తుల వంటలు చేస్తుండగా సంచరిస్తున్న పందులు

హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసినా..

వీఐపీ పుష్కర ఘాట్ వద్ద గోదావరి పుణ్యస్నానం ఆచరించడానికి వచ్చే భక్తులు నీటి సుడి గుండం తెలియక అనేక ప్రాణాలు కో ల్పోయిన విషయం తెలిసిందే. నాడు మాజీమంత్రి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అక్కడ హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేసి ప్రతీ శుక్రవారం ఒక వీఆర్ఏను పుష్కరఘాట్ వద్ద ఉండాలని ఆదేశించారు. కానీ నీటి ప్రవాహానికి హెచ్చరిక బోర్డు కొట్టుకుపోయింది. అక్కడ భక్తులకు గోదావరి లోపలికి వెళ్లనివ్వకుండా చెప్పేవారు సైతం లేరు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు తెలియక లోపలికి వెళ్లి ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు చూస్తున్నాం. ఇప్పటికైనా కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం పుష్కరగాట్లను పట్టించుకొని మహిళా భక్తులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి కనీస వసతులను ఏర్పా టు చేయాలని, భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని భక్తులు కోరుతున్నారు.

కనీస సౌకర్యాల్లేక ఇబ్బందులు పడుతున్నాం

● మార ముత్యంరెడ్డి, భక్తుడు



నదిలో స్నానాలు చేస్తే పుణ్యఫలాలు లభిస్తాయని గోదావ రినదికి వస్తే ఇక్కడ కనీస సౌకర్యాలు లేవు. తాగేందుకు నీరు సైతం లేదు. మందుబాబుల బెడద తీవ్రంగా ఉంది. వంటలు చేస్తుండగా పందులు సంచరిస్తున్నాయి. అధికారులు స్పందించి గోదావరి నదికి పుణ్యస్నానాలు చేయడానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు సౌకర్యాలు కల్పించాలి. మందు బాబుల బెడద లేకుండా చూడాలి.

లక్ష్మీ నర్సింహుని కళ్యాణానికి వేళాయే..

- లింబాద్రిగుట్టపై కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



లింబాద్రిగుట్ట గర్భగుడిలో పుష్పలంకరణలో లక్ష్మీనర్సింహస్వామి

ఆర్మూర్ టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): భీమ్‌గల్‌లోని పవిత్ర పుణ్యక్షేత్రమైన నింబాచల క్షేత్రంపై శ్రీ వారిబ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాలలో ప్రధాన ఘట్టం నర్సింహస్వామి కల్యాణ మహోత్సవానికి ముందు శ్రీలక్ష్మీనర్సింహులు ఎదుర్కోలు కార్యక్రమం ఆదివారం నింబాచల క్షేత్రంపై నిర్వహించారు. ఉదయం స్వామివారి గర్భాలయంలో మూల విరాట ప్రత్యేకపూజలు నిర్వహించారు. మధ్యాహ్నం స్వర్ణాలంకృత భూషితులైన శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఉత్సవ విగ్రహాలను మంగళవాయిద్యాల మధ్య గర్భాలయం నుంచి కల్యాణ మండపంలోకి పుష్పమాలికలచే అలంకరించిన పల్లకీలో తెచ్చారు. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన శ్రీనర్సింహుని గుర్రపు సేవపై అలకరించారు. కల్యాణ మండపం మొదటుకొని పుష్కరిణి పూరవీదులలో ప్రదక్షిణ చేయించి ఆంజనేయస్వామి ఆలయం వద్ద స్వామిని ఉంచారు. శ్రీలక్ష్మీ అమ్మవారిని పలకీలో స్వామి చెంతకు ఎదుర్కొగా తీసుకొచ్చారు. స్వామివారి శ్రీ ప్రదక్షిణ చేయించి బుక, గులాలు చల్లి ఇద్దరిని సరి సమానంగా కల్యాణ మండపం వరకు ఎదుర్కొన్నారు. ఎదుర్కోలు కార్యక్రమంలో అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడి మహోత్సవం అంటూ అర్చకులు వారి కుటుం బసభ్యులు భక్తజన బృందం పెద్దసంఖ్యలో భక్తులు నృత్యాలు చేశారు. ఎదుర్కోలు సందర్భంగా నింబాచల క్షేత్రం గోవింద నామ స్మరణాలతో మారుమ్రోగింది.

నేడు కల్యాణం

ఉత్సవాలలో భాగంగా సోమవారం శ్రీలక్ష్మీనర్సింహుల కల్యాణ మహోత్సవ వేడుకలు నిర్వహించనున్నారు. లక్ష్మీనర్సింహుని కల్యాణ మహోత్సవ వేడుకను కనులారా తిలకించేందుకు వేలాదిగా భక్తులు తరలి రానున్నారు. కళ్యాణ వేడుకలకు ఆలయ ధర్మకర్తలు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

పోలీస్ బందోబస్తు

భీమ్‌గల్ పోలీస్‌సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ఉత్సవాల సందర్భంగా బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు. ఉత్సవాలలో ప్రధాన ఘట్టం అయిన కళ్యాణం, రథోత్సవం, ముగింపు సందర్భంగా ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేయడం జరుగుతుందని సీఐ తెలిపారు.



గుర్రపు సేవలో అలంకరించిన శ్రీలక్ష్మీనర్సింహస్వామి

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : షబ్బీర్అలీ



ముషాయిరాలో మాట్లాడుతున్న షబ్బీర్ అలీ

నిజామాబాద్ అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి):నగరంలో శని వారం రాత్రి ఖోజాకాలనీలో ప్రపంచ ఉర్దూ డే సందర్భంగా నిర్వహిం చిన ముషాయిరా కార్యక్ర మంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పాల్గొన్నారు. దేశంలోని ప్రముఖ హిందీ, ఉర్దూ కవులు ఈ కార్య క్ర మంలో పాల్గొనగా శనివారం అర్ధరాత్రి వరకు ముషాయిరా నిర్వహిం చారు.ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ముస్లీంలకు 4 శాతం రిజర్వే షన్ల వల్ల ఇప్పటి వరకు 20లక్షలకు పైగా ముస్లీం విద్యార్థులు ఉన్నత చదువులు, ఉద్యోగాలు పొందారని అన్నారు. ఈ సందర్భంగా వైద్య విద్య ను అభ్యసిస్తున్న వి ద్యార్థులను సన్మానించారు. ఈ కార్యక్ర మంలో ప్ర ముఖ కవులు హాశం, ఫిరోజాబాది, సుఫియాన్ ప్రతాప్‌ఘరీ, కుష్బూశర్మ, రాజీవ్, ఖాదీర్, తమీమ్, నుడా చైర్మన్ కేశవేణు, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుంది

నిజామాబాద్ కల్చరల్:సేవా కార్యక్ర మాలు చేసే సంస్థలకు కాం గ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ అన్నారు. శని వారం రాత్రి ఇందూరు యు వత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన శాంతి కోవెల ఆశ్రమ నిర్మాణా నికి తనవంతు సహాయ సహకారాలు అం దిస్తానని అన్నారు. అనం తరం సేవా కార్యక్రమాల వివరాలను సంస్థ అ ధ్యక్షుడు సాయిబాబును అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో నుడా చైర్మన్ కేశవేణు, ఐడీసీ ఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్, కాంగ్రెస్ నాయకులు నరాల రత్నా కర్, సంస్థ ప్రతినిధులు ఉన్నారు.

సర్వేను సమగ్రంగా నిర్వహించాలి



కంజర్‌లో సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో

మోపాల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన కుల గణన ఇంటింటి సమగ్ర సర్వేను సక్రమంగా నిర్వహించాలని గ్రామ స్థా యి అధికారులకు ఆర్డీవో రాజేంద్రకుమార్ ఆదేశించారు. ఆదివారం మో పాల్ మండలంలోని మోపాల్, కంజర్, కులాస్‌పూర్, చిన్నాపూర్, మం చిప్ప తదితర గ్రామాల్లో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను స్వయంగా వెళ్లి ఆర్డీవో పరిశీలించారు. ఈ సర్వే సమగ్రంగా ఉండాలని అధికారు లకు ఆదేశించారు. గ్రామంలో ప్రతి ఇంటికి తిరుగుతూ సర్వే చేపట్టాలని కోరా రు.ఆయన వెంట మండల, గ్రామ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నగరంలో ఎండు గంజాయి పట్టివేత



గంజాయి స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు

సుభాష్‌నగర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలో గంజాయి అ మ్ముతున్నారన్న పక్కా సమాచారంతో తనిఖీలు నిర్వహించగా సుమా రు 4.2 కేజీల గంజాయిని పట్టు కొని ఒకరిని అరెస్టు చేసినట్లు నిజా మాబాద్ ఎస్‌హెచ్‌వో దిలీప్‌కుమార్ తెలిపారు. శనివారం సాయంత్రం సమయంలో కంఠేశ్వర్ బైపాస్ రోడ్‌లో తనిఖీలు నిర్వహించగా రెండు వాహనాల్లో గంజాయి తరలిస్తున్న అసత్‌బాబానగర్‌కు చెందిన సర్ప రాజు అనే వ్యక్తిని అరెస్టు చేయగా అతని వద్ద 2.1 కేజీల గంజాయి దొ రికిందన్నారు. సర్పరాజును విచారించగా ద్వారకానగర్‌కు చెందిన సా జిద్ అలీని వెంబడించగా సాజిద్ అలీ ఆటోను వదిలి పారిపోవడం జ రిగిందని తెలిపారు. ఆటోలో సుమారు 2.1కేజీల గంజాయి లభించిం ద న్నారు. ఇద్దరి దగ్గర సుమారు 4.2కేజీల గంజాయిని స్వాధీనం చేసు కొని పల్సర్‌బైక్, ఆటోను సీజ్ చేయడం జరిగిందన్నారు. సర్పరాజును రిమా ండ్‌కు పంపనున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్సై మల్లేష్, సిబ్బ ంది షబ్బీర్, ప్రభాకర్, ధర్‌సింగ్, రవి, సంగయ్య, సౌమ్య, పాల్గొన్నారు.

నేటి వరకు అర్సపల్లి రైల్వేగేట్ మూసివేత

నిజామాబాద్ అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి):నగర శివారులోని అర్సపల్లి రైల్వేగేట్ మరమ్మతు పనులు ఇంకా కొనసాగుతున్న దృష్ట్యా ఈనెల 11 వరకు రైల్వేగేట్ మూసి ఉంచనున్నట్లు రైల్వేశాఖ అధికారులు తెలిపారు. ఈనెల 10 వరకు మొదట రైల్వేగేట్ మూసివేస్తున్నట్లు గతం లో తెలుపగా ఇంకా రైల్వేగేట్ వద్ద పనులు పూర్తికాకపోవడంతో ఈనెల 11న సాయంత్రం వరకు రైల్వేగేట్ మూసి ఉంచనున్నట్లు వారు తెలి పారు. ప్రజలు ఇతర రూట్‌లలో రాకపోకలు సాగించి పనులకు సహక రించాలని రైల్వే అధికారులు తెలిపారు.

నగరంలో పీడీఎస్ బియ్యం పట్టివేత

నిజామాబాద్‌అర్బన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి):నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం భారీగా పీడీఎస్ బియ్యాన్ని ఒకటో టౌన్ పోలీసులు పట్టుకున్నారు. నగరంలోని ఓ గోదాంలో నిల్వ ఉంచిన సు మారు రెండు క్వింటాళ్ల బియ్యాన్ని ఒకటవ టౌన్ ఎస్‌హెచ్‌వో రఘు పతి ఆధ్వర్యంలో పట్టుకున్నారు.అశోకనగర్ ప్రాంతంలోని సుల్తాన్- సుమే ర్‌లకు సంబం ధించిన గోదాంలో డీసీఎం లారీలో పీడీఎస్ బియ్యాన్ని లోడ్ చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు.ఈ మేరకుఇటీవల మాక్లూర్ మండలంలో సుమేర్-సుల్తాన్‌లపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమో దైంది. ఈ మేరకు ఒకటో టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ యోగా పోటీలకు జిల్లా విద్యార్థులు

సుభాష్‌నగర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఐదవ జాతీయ స్థాయి సబ్ జూని యర్ బాలబాలికల యోగా పోటీలకు జిల్లాకు చెందిన విద్యా ర్థులు ఎంపికయ్యారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమా వేశంలో ఎంపికైన విద్యార్థులను యోగా పోటీలకు పంపనున్నట్లు యో గాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు యోగా రాంచందర్ తెలిపారు. ఈనెల 11 నుంచి 14వ తేదీ వరకు అస్సాం రాష్ట్రంలోని గౌహ తిలో జరుగనున్న ఈ పోటీలు విద్యార్థులు పాల్గొననున్నట్లు తెలిపారు. గత నెల సంగారెడ్డిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలో ప్రతిభకనబర్చిన విద్యార్థులను జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని అన్నారు. 10 నుంచి 14 సంవత్సరాల విభాగంలో తనయ తన్వీ 18 నుంచి 20 సంవ త్సరాల విభాగంలో నిర్ణయ, హాసిని, హసితలు తెలంగాణ రాష్ట్రం నుంచి పోటీలకు హాజరుకానున్నట్లు తెలిపారు. తెలంగాణ జట్టుకు రఘువీర్ కోచ్‌గా వ్యవహరిస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో బాల శేఖర్, సంగీత, తదితరులు పాల్గొన్నారు.



జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికైన విద్యార్థులు

వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

● రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

మోపాల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో నిర్వ హించే ఉచిత వైద్య శిబిరాన్ని గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకో వాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. ఆదివారం నిజామాబాద్ రూరల్ మండలంలోని జలాల్‌పూర్ గ్రామంలో శ్రీసిగ్మా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కంటి ఆపరేషన్ మొబైల్ థియేటర్ వాహ నాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొంద రు వైద్యాధికారులు గ్రామీణ ప్రాంతాల్లో గ్రామీణ ప్రజలు ఎదుర్కొ ంటు న్న వ్యాధులను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రాంతాల్లో ఉచితంగా వైద్య శిబి రాలను ఏర్పాటు చేయడం అభినందనీ యమన్నారు. గ్రామీణ ప్రజలు ఈ వైద్య శిబిరాలకు వచ్చి వివిధ వ్యాధులతో బాధపడుతున్న వారం దరూ ఈ శిబిరంలో పరిశీలించుకొని మందులు తీసుకోవాలని కోరారు. అనంతరం గ్రామంలో నిర్వహిస్తున్న కులగణన సర్వే సమ గ్రంగా జరుగుతున్నది లేనిది తెలుసుకునేందుకు గ్రామాల్లోని ఇంటింటికి తిరిగి అడిగి తెలుసుకున్నారు. అర్హులకు ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలు సమగ్రంగా అందడం లేదని దీనికోసమే సీఎం రేవంత్‌రెడ్డి కులగణన సర్వేను చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ పథకాలు అన ర్హులకు అందుతున్నాయని నిజమైన అర్హులకు ఈ పథ కాలు అందక పోవడం శోచనీయమన్నారు. గ్రామాల్లో నిర్వహించే కుల గణన సర్వేను అధికారులు సమగ్రవంతంగా నిర్వహించి ప్రభుత్వానికి నివేదికలను పం పాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ ముప్ప గంగా రెడ్డి, పీసీసీ డెలిగేట్ చంద్రశేఖర్‌గౌడ్, నాయకులు గడీల రాములు, బా గారెడ్డి,ప్రజాప్రతినిధులు,వైద్యాధికారులు, సొసైటీ చైర్మన్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

● నూతన దంపతులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే

సాంపల్లి గ్రామానికి చెందిన అంతరెడ్డి కుటుంబ సభ్యుల వివాహ వేడుకకు రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి డిచ్‌పల్లిలోని జీ కన్వెన్సన్ లో హాజరై నూతన వధువరులను ఆశీర్వాదించారు. ఈ వివాహ కార్యక్ర మంలో ఎమ్మెల్యే వెంట పార్టీ ప్రతినిధులు శేఖర్ గౌడ్, ధర్మగౌడ్, మోహన్‌రెడ్డి, పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలో బాలికల జట్టు జయకేతనం

సుభాష్‌నగర్,నవంబరు10(ఆంధ్రజ్యోతి):ఎస్‌జీఎఫ్ అండర్-19 సాఫ్ట్ బాల్ పోటీలో జిల్లా బాలికల జట్టు ప్రథమ స్థానాన్ని సాధించింది. బా లుర జట్టు తృతీయ స్థానంతో సరిపెట్టుకుంది. 8 నుంచి 10 వరకు మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లిలో ఎస్‌జీఎఫ్ అండర్-19 రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించారు. ఈపోటీలో జిల్లా బాలికల జట్టు మెదక్ జట్టుపై 5-3పరుగుల తేడాతో విజయం సాధించింది.బాలుర జట్టు తృతీయ స్థా నం కోసం జరిగిన పోటీలో మహబూబ్‌నగర్ జట్టుపై 5-2 పరుగుల తే డాతో విజయం సాధించి మూడోస్థానాన్ని కైవసం చేసుకుంది.విజేతల కు బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్,ఆదిలాబాద్ ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ బాబు రావు, టోర్నమెంట్‌పరిశీలకుడు బహుమతు లను అందజేశారు.

● జాతీయ స్థాయికి జిల్లా క్రీడాకారులు

జిల్లా జట్టును విజయ తీరాలకు చేర్చిన జిల్లా క్రీడాకారులను జాతీయ స్థాయికి ఎంపిక చేశారు. బాలికలలో నేహశ్రీ, గం గోత్రి,శ్రావ్య, మహేశ్వరి,ప్రీతి, బాలుర విభాగంలో అశ్వజ్, ప్రసాద్‌లు ఎంపికయ్యారు.



ప్రథమ స్థానం సాధించిన బాలికల సాఫ్ట్‌బాల్ జట్టు

సుభాష్‌నగర్: రాష్ట్రస్థాయి అండర్-17 ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో జిల్లా ఖోఖో జట్టు ప్రథమ స్థానం సాధిం చింది. ఖమ్మంలో జరుగు తున్న రాష్ట్ర స్థాయి పోటీలో జిల్లా జట్టు తన దైన అద్భుతమైన ప్రతిభ తో విజయం సాధించి ప్రథ మ స్థానంలో నిలి చింది. ఫైనల్ పోటీలలో నల్గొండ, నిజామాబాద్ జట్లు తలపడగా 3 పాయింట్ల తేడాతో విజయం సాధించి ప్రథమ స్థానాన్ని కైవసం చేసు కుంది.

ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ పరిశీలన



ఏబీసీ సెంటర్‌ను పరిశీలించిన కమిషనర్

సుభాష్‌నగర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్ పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ రోడ్‌లోగల ఏబీసీ సెంటర్‌ను ఆదివారం ఉదయం పరిశీలించారు. వీధి కుక్కల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారనేది అధికారులను అడిగి తెలుసు కున్నారు. వీధి కుక్క లకు కు.ని. ఆపరేషన్లపై అక్కడి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. కమి షనర్ వెంట మేనేజర్ జనార్దన్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

● సర్వే పనితీరును పరిశీలించిన కమిషనర్

నగర పాలక సంస్థ పరిధిలో జరుగుతున్న సోషల్ ఎకనామిక్ సర్వే ను కమిషనర్ దిలీప్‌కుమార్ పరిశీలించారు. నగరంలోని కాలూర్ గ్రా మంలో ఆదివారం జరుగుతున్న సర్వే పనితీరును పరిశీలించారు. గ్రా మంలోని అధికారులు చేస్తున్న సర్వేపై వివరాలను అడిగి తెలుసు కున్నారు. కొన్ని చోట్ల ప్రజలతో మాట్లాడారు. సర్వే వివరాలు పక్కాగా సేకరించాలని ఎలాంటి తప్పిదాలు లేకుండా చూడాలని అధికారులను కోరారు.ఈకార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదిత రులు పాల్గొన్నారు.

317 జీవో టీచర్లను సొంత జిల్లాలకు కేటాయించాలి



ఉపాధ్యాయుల దీక్షకు మద్దతు తెలిపిన ఉపాధ్యాయ సంఘ నాయకులు

నిజామాబాద్ అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జీవో నంబరు 317 ద్వారా స్థానికతను కోల్పోయిన ఉద్యోగ ఉపాధ్యాయులను వెంటనే సొంత జిల్లాలకు కేటాయించాలని కోరుతూ పాత కలెక్టరేట్ వద్ద ఆదివారం నిర్వహించిన న్యాయదీక్షకు పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు మద్దతు తెలిపి సంఘీభావం ప్రకటించారు. ఈ దీక్షకు టీ ఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సత్యానంద్, పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మోహన్‌రెడ్డి, కిషన్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెనిగళ్ల సురేష్, తదితరులు మద్దతు తెలిపారు. వెంటనే జీవో నంబర్ 317 వల్ల స్థానికతను కోల్పోయిన ఉద్యోగ ఉపాధ్యాయులను సొంత జిల్లాలకు కేటాయించాలని మంత్రివర్గ సబ్ కమిటీ ఇచ్చిన రిపోర్టును బహిర్గతం చేయాలన్నారు. సొంత జిల్లాలకు పంపిస్తామన్న సీఎం తన మాటను నిలబెట్టుకోవాలని ఉపాధ్యాయ సంఘ నాయకులు డిమాండ్ చేశారు.

భాషా పండితులను నియమించాలి



రాష్ట్ర బాధ్యులకు వినతి పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

డిచ్‌పల్లి,నవంబరు 11: రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ తెలం గాణ రాష్ట్రీయ కౌన్సిల్ సమావేశంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో భాష పండితులు తెలుగు, హిందీ వాళ్లను నియమించాలని రాష్ట్ర బా ధ్యులకు వినతి పత్రం అందజేసి నట్లు జిల్లా అధ్యక్షుడు ఎండీ జమీ ఉల్లా జిల్లా ప్రధాన కార్యదర్శి గణపురం దేవేందర్, రమణ చారిలు కోరారు. ఆదివారం సికింద్రాబాద్‌లోని ముషీరాబాద్ ప్రాథ మిక పాఠ శాలలో రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత్ పరిషత్ జరిగిం దని, వారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదోన్నతులు రాకుండా మిగిలిపోయిన 1070 తెలుగు, హిందీ, ఉర్దూ భాషపండితులకు పదో న్నతులు ఇప్పిం చేలా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని లెఫ్ట్ ఓవర్ వెకెన్సీ కింద, ప్రధా నోపాధ్యాయుల కింద పదవీ విరమణ తర్వాత ఖాళీల ను పదోన్నతుల ద్వారా కల్పించాలని వారు పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం మ్యానిఫె స్టోలో ఇచ్చిన హామీ 317 జీవోను సబ్ కమిటీ ఇచ్చిన రిపోర్టు మీద వెంటనే జీవోను రిలీజ్‌చేసి స్పౌచ్, మ్యూచ్ వల్, మెడికల్ కింద అర్హ త కలిగిన వారికిఆవకాశం కల్పించాలన్నారు. రెండెళ్లుగా పెండింగ్‌లో ఉన్న జీపీఎఫ్, ఏపీజీఎల్ ఐలోన్‌పార్టు ఫైనల్, సరెండర్ లీవ్ డ బ్బులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

సదన్‌కు నీళ్ల మోటారు అందజేత

డిచ్‌పల్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): డిచ్‌పల్లి లో మానవత సదన్ కు రోటరీ క్లబ్ నిజామాబాద్, నిజామాబాద్ మిషన్ సబ్ మర్సిబుల్ బోరు పంపును ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా నిజా మా బాద్ జాయింట్ సెక్రటరి సుధాకర్‌రావు అధ్యక్షుడు విజయ్‌రావు, సభ్యు లుబాబు రావు, సతీష్‌షా, ప్రకాశ్, గురుప్రిత్ సింగ్‌లు రూ.28వేల విలు వ గల నీళ్ల మోటారును అందజేశారని సదన్ ఇన్‌చార్జ్ రమేశ్ తెలి పారు. సదన్ సమస్యల పరిష్కారంలో రోటరీ క్లబ్ తమవంతు సహకారం అందిస్తుందని, వారు పేర్కొన్నారు.



నీళ్ల మోటారు సెట్‌ను అందజేస్తున్న దృశ్యం

ఆకట్టుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వవిద్యార్థులు

నిజామాబాద్‌అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి):జిల్లా కేంద్రంలో ఆది వా రం నిర్వహించిన పలు పాఠశాలల పూ ర్వ విద్యార్థుల సమ్మేళ నాలు ఆకట్టు కునే లా సాగాయి. 1990 బ్యాచ్ 7వ తర గతి చది విన పూర్వ విద్యార్థులు నగరం లోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయసమ్మేళనాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ప్రవీణ్ కుమార్, రాజు, అజ య్, రజిని, సునీత, పాల్గొ న్నారు.

● వివేకానంద పాఠశాల

నగరంలోని ఏఎస్‌ఆర్ ఫంక్షన్‌హాల్‌లో పద్మానగర్ కోటగల్లిలోని వివేకానంద వి ద్యాలయ 1997-98 పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వ హించారు. ఆనాటి జ్ఞాపకాలను నెమ రు వేసుకుంటూ విద్యాబుద్ధులు నేర్పి న గురు వులను సన్మానించుకు న్నారు. పాఠశాల చైర్మన్‌రవికాంత్, టీచర్లు శ్రీ కాంత్,పరమేశ్వ ర్,శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్పల్లి:మండలం కేంద్రంలోగల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1993 -94ఎస్సెస్సీ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మే ళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులు తమ తమ యోగ క్షేమాలతో పాటు తా ము చదువుకున్న పాఠశాలల్లో జ్ఞాపకా లను పంచుకు న్నారు. 20 సంవత్సరాల క్రితం చదువ ుకున్న తాము ఇప్పుడు కలు సుకో వడం ఎంతో సంతోషంగా ఉందని ఈ సంద ర్భంగా వారు పేర్కొన్నారు.ఈ సంద ర్భంగా పూర్వ విద్యార్థులు ఆటపా టలతో ఉల్లాసంగా ఉత్సాహంగా గడి పారు.



హాజరైన పూర్వ విద్యార్థులు

పరిధి పెంచారు.. సిబ్బందిని మరిచారు!

(ఐదో పేజీ తరువాయి)

2017లో ఏర్పడిన నుడాలో పూర్తిస్థాయి సిబ్బందిని నియమించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన సీడీఎంఏ అధికారులు పట్టించుకోవడం లే దు. 2020 నుంచి ఇప్పటి వరకు ఎన్నోసార్లు అధికారులు సిబ్బంది పెంపు పై లేఖలు రాసినా నియామకాలు చేయడం లేదు. ప్రస్తుతం నుడా పరి ధిలో పనిచేస్తున్న సీపీవోకు మున్సిపల్ బాధ్యతలు కూడా ఉండగా ఇతర ముగ్గురు సిబ్బందిని మున్సిపల్ నుంచి డిప్యూటేషన్‌పై నుడాకు కేటాయి ంచిన వారికి కూడా మున్సిపల్ పనులే అధికంగా ఉంటున్నాయి. అక్కడ పనిచేస్తూ తిరిగి నుడా విధులు కూడా నిర్వహించడం కష్టంగా మారుతు ందని సిబ్బంది వాపోతున్నారు. పరిధి పెంచినప్పటికీ సిబ్బంది కేటాయిం పు విషయంలో ప్రభుత్వం నుంచి స్పష్టత లేకపోవడంతో ఇప్పుడు పనిచే స్తున్న సిబ్బంది సైతం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉంది. గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పన కోసం ఏర్పాటు చేసిన నుడా సిబ్బంది కొరత వల్ల చేయాల్సిన అభివృద్ధి పనులు సైతం సక్రమంగా చేయడం లేదు. నుడా పరిధిలోని గ్రామాలలో వెంచర్ల అనుమతులు, పరిశ్రమల ఏ ర్పాటు, ఇతర అభివృద్ధి పనులకు నుడా అనుమతులు తప్పనిసరి తీసుకో వాల్సి ఉంటుంది. చాలీ చాలని సిబ్బందితో అభివృద్ధి పనులు సాధ్యం కావని ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బంది చెబుతున్నారు. పరిధి పెంచిన ప్ర భుత్వం సిబ్బందిని కూడా నియమిస్తే నుడా ద్వారా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం సాధ్యమవుతుందని వారు పేర్కొంటున్నారు.

కందకుర్తి అభివృద్ధికి కృషి

(ఐదో పేజీ తరువాయి)

సంస్థగా ఏర్పడిందని,ఆర్‌ఎస్‌ఎస్ ఏర్పాటుకు కందకుర్తి గ్రామం పు రుడు పోసుకుందని, ఇంతటి మహోన్నతమైన పవిత్ర క్షేత్రంలో త్రివేణి సంగమ క్షేత్రం ఉండడం దేశానికి గర్వకారణమని అన్నారు. భారత సం స్కృతిని విశ్వవ్యాప్తం చేసేందుకు మోదీ కృషి చేస్తున్నారని, భారత దేశా న్ని ప్రపంచంలో మూడో అగ్రగామి దేశంగా తీర్చి దిద్దేందుకు పని చేస్తు న్నారని అన్నారు. ప్రతి ఒక్కరూ దేశం, ధర్మం, గోమాత రక్షణకు కృషి చే యాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేశవ సేవా సమితి అధ్యక్షు డు సుధాకర్ రెడ్డి, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు గోవింద్, రమేష్, రచ్చ తిరు పతి, హన్మంత్ రావు, యోగేష్, పల్లె గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● త్రివేణి క్షేత్రాన్ని అభివృద్ధి చేసి తీరుతాం :ఎమ్మెల్యే

తెలంగాణకే గర్వకారణమైన కందకుర్తి త్రివేణి సంగమ క్షేత్రాన్ని మ రింత అభివృద్ధి చేసి తీరుతానని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నా రు. ఆదివారం కందకుర్తి స్మృతి వనాన్ని దర్శించేందుకు వచ్చిన హర్యా నా గవర్నర్ బండారు దత్తాత్రేయతో కలిసి రామ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా, కందకుర్తి గ్రామానికి విచ్చేసిన హర్యా నా గవర్నర్‌ను పూలమాలలతో ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు.

టీయూ నిధులకు కృషి చేస్తా..

● హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ

డిచ్‌పల్లి:టీయూకి పూర్తి స్థాయిలో నిధులు ఇచ్చేలా ప్రభుత్వాన్ని తాను కోరుతానని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. ఆది వారం కందకుర్తికి వెళ్తుండగా మార్గమధ్యలో డిచ్‌పల్లి మాజీ ఎంపీపీ, బీజేపీసీనియర్ నాయకుడు గద్దెభూమన్న ఇంట్లో అల్పాహారం కోసం ఆ గారు.ఈసందర్భంగా పోలీసులు దత్తాత్రేయకు గౌరవ వందనంచేశా రు. అనంతరం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ.. బీడీ కార్మి కులు జిల్లాలోనే అధికంగా ఉన్నారని తాను గతంలో కేంద్ర కార్మిక శాఖ మం త్రిగా కార్మికుల సమస్యలు పరిష్కరించానని కార్మికులకు ఆరోగ్య భద్రతో పాటు పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యాలు మెరుగుపర్చానని పేర్కొన్నారు. నిజాం సాగర్ ఆయకట్టు కింద రైతాంగానికి సాగు నీరు అందేల ప్రభుత్వం కృసి చేయలన్నారు.పసుపురైతుల సమస్యలు పరిష్కరించేలా కృషఙ చేస్తానని, జిల్లా సమస్యల పరిష్కారానికి తప్పక చేయూత అంది స్తానని అన్నా రు. తాను ఆరోజుల్లోనే డిచ్‌పల్లి, అర్గుల్, ధర్పల్లి, సిరికొండ, న్యావనంది, భీమ్ గల్ ప్రాంతాల్లో సైకిల్‌పై పర్యటించానని పేర్కొన్నారు. ఆయన వెంట అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనా రాయణ, జిల్లా బీజేపీ అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులచారి ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి



రైతులతో మాట్లాడుతున్న ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్

డిచ్‌పల్లి,నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకొని లబ్ది పొందాలని దళారులకు విక్ర యించి నష్ట పోవద్దని, ఐడీసీఎంఎస్ చైర్మన్ తారచంద్ నాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని కమలాపూర్, మిట్టపల్లి, గొల్లపల్లి, ఇందల్వాయి మండలంలోని అన్సాన్‌పల్లి, ఎల్లారెడ్డి పల్లి, రామడుగు ప్రాజెక్ట గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏబీఎం చిన్నయ్య, అసిస్టెంట్ కిసన్, సూపర్‌వైసర్ సెంటర్ ఇన్‌చార్జ్‌లతో కలిసి పరిశీలించారు. అనంతరం రై తులతో తారచంద్ నాయక్ వివరాలు అడిగి తెలుసుకు న్నారు. రైతులకు 500రూ.బోనాస్ తప్పక ఇస్తామని సన్నరకం వడ్లను కొనుగోలు చేసే ముందు సహకార సంఘాల సిబ్బంది తేమ 14నుంచి 15శాతం ఉండేలా చూసుకోవాలన్నారు.

● ఇందల్వాయిలో డయాగ్నస్టిక్ సెంటర్ ప్రారంభం

మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన డయోగ్నస్టిక్ సెంటర్‌ను ఆది వారం ఐడీసీఎంఎస్ చైర్మన్ తారచంద్ నాయక్ ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సేవ చేయడానికి ఈ సెంటర్ ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు.

చికెన్ ధరలు

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.150	రూ.265	రూ. 285
వెన్‌కాబ్(కిలో)	: రూ.160	రూ.270	రూ. 290

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.80000	రూ.73800	రూ.965

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : అమరన్ (12.00, 6.45, 10.15)
: క (3.30)
స్క్రీన్-2 : అమరన్ (10.00)
: అప్పుడో ఇప్పుడో ఎప్పుడో (1.30)
: లక్కీ భాస్కర్ (4.15, 7.30, 10.45)
స్క్రీన్-3 : సింగం అగేన్ (హిందీ) (10.50)
: ధూంధాం (2.00)
: అప్పుడో ఇప్పుడో ఎప్పుడో (5.00)
: జితేందర్ రెడ్డి (7.45)
: క (10.45)
స్క్రీన్-4 : బూల్ బులియా-3 (హిందీ) (10.00, 7.05)
: వంచన (1.25)
: బ్లడీ బగ్గర్ (4.05)
: సింగం అగేన్ (హిందీ) (10.30)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : అప్పుడో ఇప్పుడో ఎప్పుడో (10.35)
: లక్కీ భాస్కర్ (1.30, 7.30)
: క (4.30, 10.30)
స్క్రీన్-3: అమరన్ (10.30, 4.20, 7.30, 10.30)
: జితేందర్‌రెడ్డి (1.40)

దేవి : లక్కీ భాస్కర్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్: అమరన్ (11.15, 6.15)
: సింగం అగేన్ (హిందీ) (2.15, 9.15)
విజయ్ : క (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్ : దేవర (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్